తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బైక్‌ను ఢీకొన్న కారు : ఇద్దరు మృతి



చిల్లకూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని పారిచర్లవారిపాలెం గ్రామ సమీపంలో సోమవారం గూడూరు వైపుకు బైకుపై ఇద్దరు వ్యక్తులు వెళుతుండగా గూడూరు నుండి చింతవరం వస్తున్న కారు ఎదురుగా ఢీకొనడంతో ఎస్‌కె అల్లాబక్ష (57), వెనుక వున్న మరో వ క్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ బి గోపాల్ సంఘటనా స్థలానికి చేరుకొని మాట్లాడుతు మృతి చెందిన ఎస్‌కె అల్లాబక్ష తిమ్మన్నగారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలిపారు. మరో వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని అన్నారు. రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

## వైభవంగా చక్రతీర్థముక్కోటి

తిరుమల, డిసెంబర్ 5 ప్రభాతవార్తప్రతినిధి:



శేషాచలంలోని వేలకోట్ల తీర్థాలలో చక్రతీర్థం ఒకటి. వెంకన్న ఆలయానికి కొన్ని కిలోమీటర్లు దూరంలో ఉన్న చక్రతీర్థంలో కార్తీక సోమ వారం ముక్కోటి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయం నుంచి పరిచార కులు, అర్చకులు చక్రతీర్థం చేరుకుని విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

### రాష్ట్ర అభివృద్ధికోసం

# సిఎం జగన్ నిరంతరం కృషి

### మంత్రి ఆర్‌కె రోజా



లబ్ధిదారులకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆర్‌కె రోజా

నింద్ర, డిసెంబరు 5 ప్రభాతవార్త :

రాష్ట్ర అభివృద్ధికోసం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అత్తూరు గ్రామపంచాయితీలో రాష్ట్ర ప్రభుత్వం డిబిటి ద్వారా పేదలకి అందజేసిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా చేతుల మీదుగా అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి, వేయని వారికి, ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రూపంలో సహాయం అందజేస్తున్నారని తెలిపారు. గతంలో రాష్ట్రంలో పరిపాలన చేసిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శించారు. రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలలో వైకాపా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలలో 98శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని తెలిపారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలకు ఆతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందజేస్తున్నార న్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులు తీసుకొని వస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడు 29 గ్రామాలే రాజధాని అని రియల్ ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతున్నారని విమర్శించారు. పేదలకు సంక్షేమ పథకాలు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తావుంటే టిడిపి నాయకులు నారా చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలు అందజేయడం వల్ల రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని విమర్శిస్తావుండారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు, యంపిపి దీపాజలంధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, కో ఆప్షన్ మెంబరు అనిల్, యంపిటిసిలు విజయ, విజేష్, వెలుగు ఎపియం చంద్రకళ, సిడిపిఓ శోభారాణి, నాయకులు గోపి, మహేష్, రామచంద్రారెడ్డి, తోయజాక్షి, సంపత్‌కుమార్, బాబురెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# గోవిందుని దర్శనం...పరమానందం!

### దేవదేవుని ఆలయంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము





తిరుమల, డిసెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:

దేశప్రథమపౌరురాలు ద్రౌపది ముర్ము తొలిసారి దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని సంతోషం వ్యక్తం చేశారు. టిటిడి అధికారులు మంచి దర్శనం చేయించారని కితాబిచ్చారు. దేవుని ఆలయంలో పూర్తిగా ఆధ్యాత్మికభావంతో కనిపించారు. రాష్ట్రపతి హోదాలో తొలిసారిగా సోమవారం ఉదయం ద్రౌపది ముర్ము స్వామివారి పుష్కరిణిలో నీటిని ప్రోక్షణం చేసుకుని, భూవరాహస్వామిని దర్శించుకున్నారు. శ్రీవారి ఆలయ మహ ద్వారం వద్ద టిటిడి పాలకమండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఓ ఏవి ధర్మారెడ్డి, డిప్యూటీ ఇఓ పి.హరీంద్రనాథ్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, కిరణ్‌దీక్షితులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. శ్రీవేంకటేశ్వరస్వామి ని దర్శించుకున్నారు. రాష్ట్రపతి వెంట కేంద్రపర్యాటకశాఖా మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రులు నారాయణస్వామి, కొట్టు సత్యనారాయణ, రాష్ట్రమంత్రి ఆర్‌కె రోజా, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, టిటిడి సివిఎస్ఓ నరసింహకిశోర్, చిత్తూరు జిల్లా ఎస్‌పి రిశాంత్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం డ్రైఫ్లవర్స్ టెక్నాలజీతో రూపొందించిన శ్రీవారు, పద్మావతి అమ్మ వార్ల ప్రతిమలున్న ఫోటోఫ్రేమ్‌లు రాష్ట్రపతికి బహుకరించారు. అలిపిరి వద్ద ఉన్న సప్తగోప్రదక్షిణమందిరాన్ని రాష్ట్రపతి ముర్ము దర్శించుకున్నారు. గోమాతకు స్వయంగాదాణా, గడ్డిని తినిపించారు.

## స్టాల్స్‌ను పరిశీలించిన రాష్ట్రపతి

తిరుపతి (విద్య), డిసెంబర్ 5, ప్రభాతవార్త




శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ కాళహస్తి కలంకారి పెయింటింగ్ ప్రపంచ ప్రసిద్ధి పొందినదని సేంద్రీయ పదార్థాలను వాడి బట్టలపై రంగులను వేయడం జరుగుతుందని ఒక ప్రత్యేకమైన హస్తకళ అని కలం అంటే చేతితో వేసే బొమ్మలు అక్షరాలు అని కలంకారీ బట్టలు ధరించడం వల్ల ఆరోగ్యానికి, చర్మ సౌందర్యానికి మేలుకలుగుతుందని అని కలంకారి ఆర్టిస్ట్ కలంకారి పద్మ తెలిపారు. మొదటిసారిగా రాష్ట్రపతి హోదాలో తిరుపతికి విచ్చేసిన ద్రౌపది ముర్ముకి 12 మంది కళాకారులైన తాము మూడు రోజుల పాటు కంచి పట్టు చీరపై తమరి బయోగ్రఫీ వ్రాశామని ఆ చీరను స్వీకరించాలని కోరుతూ బహుమతిగా చీర జాకెట్ భారత రాష్ట్ర పతికి అందించారు. అలాగే స్వయం సహాయ సంఘాలు మదవమాల మహిళలు చెక్క వస్తువులపై దేవుని చిత్రాలు విగ్రహాలు చెక్కడం, ఎర్రమరెడ్డి పాలెం, రాగి పాత్రలు తయారీ పూజా సమయంలో రాగి పాత్రల వినియోగం, ఒక గ్రామ్ గోల్డ్ అభరణాలు తయారీ వాటి వల్ల మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించగలుగుతున్నామని స్వయం సహాయ సంఘాల మహిళలు భారత రాష్ట్రపతికి తమ ఉత్పత్తులను చూపిస్తూ సభ్యురాలు మాధవి వరించారు. మహిళలు నెలకు రూ. 10 వేల నుండి 25 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారని డిఆర్‌డిఏ డ్వామా శాఖల సహకారంతో రాణించగలుగుతున్నామని అన్నారు. మహిళా విశ్వ విద్యాలయ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సిరికల్చర్, బయోసైన్స్ ఆధ్వర్యంలో పట్టు పురుగులు, ప్యాబ్రిక్ వ్యర్థాలు అధికంగా ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో పర్యావరణానికి హాని కలుగకుండా తిరిగి వినియోగంతో తీసుకురావాలనే ఉద్దేశ్యంతో గ్రీటింగ్ కార్డులు, పూల బోకేలు, దండలు గోడ అలంకరణ వస్తువులు, తయారు చేస్తున్నామని స్వయం సహాయ సంఘాల మహిళలకు శిక్షణ ఇస్తున్నామని డా. శ్వేత ప్రియ, లలిత, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థినులు వివరించారు. అలాగే పుష్ప ప్రసాదం, డాక్టర్‌శ్రీదేవి ఆక్వా కల్చర్ పండ్ల వ్యర్థాల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

## ఇళ్ళ నిర్మాణాలు మరింత వేగవంతం

**- సిమెంట్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు**

**- జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్**



చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

క్షేత్ర స్థాయి సిబ్బంది నుండి అధికారుల వరకు సమిష్టిగా జగనన్న ఇళ్ళ నిర్మాణాల కార్యక్రమంను మరింత వేగవంతంగా చేపట్టి పనులు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జెసి వెంకటేశ్వర్ సోమవారం కలెక్టరేట్ నుండి ఇళ్ళ నిర్మాణాల ప్రగతిపై ఎంపిడిఓలు, హౌసింగ్ ఎఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఇటీవల మంజూరు చేసిన ఇళ్ళ నిర్మాణాలను సైతం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ళ నిర్మాణాల్లో వెనుకబడిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను క్షేత్ర స్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకొని పరిస్థితులను చక్కబెట్టి నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అలాగే సిమెంట్ ఇండెంట్లు సకాలంలో పెట్టి అవసరమైన మేరకు సిమెంట్‌ను తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి సిమెంటు సమస్య ఎక్కడా ఉత్పన్నం కాకుండా చర్యలఉ తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సిమెంట్ సమస్య ఉత్పన్నమైతే ప్రక్క ప్రాంతాల నుండి సిమెంటు తీసుకొని ఇళ్ళ నిర్మాణాలు ఆగకుండా చూడాలన్నారు. ఆపై తమకు వచ్చిన సిమెంట్‌ను ప్రక్కవారికి అందించాలన్నారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి స్టేజ్ కన్వర్షన్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిర్దేశించిన గడువులోపు లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని జెసి పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా హౌసింగ్ డిఎం పద్మనాభం, మండలాల నుండి ఎంపిడిఓలు, హౌసింగ్ ఎఇలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## స్పందనకు 213 అర్జీలు



చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి 213 మంది ప్రజలు సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రజలు సమస్యలపై అందించిన విన్నపాలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్‌లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో రెవెన్యూకు సంబంధించి 79, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 15, హౌసింగ్ 4, పంచాయతీరాజ్ 7, ట్రాన్స్‌కో 4, పోలీసు శాఖ 7, ఇతర శాఖలకు సంబంధించి 16 అర్జీలు అధికారులకు అందాయి.

## నిత్యాన్న ప్రసాదానికి రూ.ఐదులక్షల విరాళం



శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో జవాబుదారి తనంతో, భక్తులకు అందుబాటులో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాదానికిపొరుగు రాష్ట్రాల, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా స్థానికంగా కూడా సహాకారం అందుతుంది. నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి చెందిన గుంటకట్ట శ్రీనివాసమూర్తి కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులును కలసి తాము నిత్యాన్న ప్రసాదానికి విరాళం ఇవ్వాలని కోరారు. వారు రూ. 5లక్షలు నిత్యాన్న ప్రసాదానికి విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమాల్లో అకౌంటెంట్ ప్రశాంత్ కిషోర్, గుమాస్తా సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కర్నాటక అక్రమ టెట్రా ప్యాకెట్లు, మద్యం స్వాధీనం

### ముగ్గురు నిందితులు అరెస్టు - డిఎస్పీ శ్రీనివాసమూర్తి



టుటౌన్ పోలీసులకు పట్టుబడ్డ కర్నాటక అక్రమ మద్యం టెట్రా ప్యాకెట్లు

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీసులు సోమవారం తెల్లవారుజాము తెనేబండలో అక్రమ కర్నాటక మద్యం నిల్వ వుంచిన ప్రాంతంపై దాడులు నిర్వహించి 50 వేల రూపాయల విలువైన 451 కర్నాటక టెట్రా ప్యాకెట్లు, మద్యంను స్వాధీనం చేసుకొన్నారు. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ నిల్వ వుంచి విక్రయించడానికి సిద్ధంగా వున్న అక్రమ కర్నాటక మద్యం వున్న ప్రదేశంపై టుటౌన్ పోలీసులు దాడులు చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కర్నాటక అక్రమ మద్యం నిల్వ వుందని సమాచారం అందడంతో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో ఇన్‌ఛార్జీ టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జున్ సిబ్బందితో కలసి సోమవారం తెల్లవారుజాము తెనేబండకు వెళ్ళారన్నారు. ఈ సమయంలో అక్కడ ముగ్గురు వ్యక్తులు నిలబడి ఒక తెల్లటి సంచి, కొన్ని అట్టె పెట్టెలను పెట్టుకొని అక్రమ మద్యంను వాటిలో తీసుకొని వెళ్ళడానికి సిద్ధంగా వున్నారన్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసిన ముగ్గురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నిస్తే పోలీసులు వారిని వెంబడించి పట్టుకొన్నారని తెలిపారు. ఈ కేసులో తెనేబండకు చెందిన ఎస్.సురేష్(28), ఎస్.పురుషోత్తం(32), వి.ఆనంద్(35)లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారన్నారు. అలాగే ఈ కేసులో చిత్తూరు మిట్టూరుకు చెందిన క్రాంతికుమార్ పరారీలో వున్నాడని, ఇతని కోసం పోలీసులు గాలిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జీ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు, టుటౌన్ ఎస్ఐ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### పదోన్నతులు నిర్వహించకుండా

## దూర ప్రాంతాలకు డిప్యుటేషన్లా!

### - డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ధర్నా




చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

ఉపాధ్యాయులకు పదోన్నతులు నిర్వహించకుండా వర్క్ అజెస్ట్‌మెంట్ పేరిట దూర ప్రాంతాలకు డిప్యుటేషన్లు వేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి డిఇఓ కార్యాలయం ఎదుట యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి రఘుపతిరెడ్డి, జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి, జివి రమణలు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొచ్చిన మార్పుల మేరకు సబ్జెక్టు టీచర్లతో విద్యార్థులకు బోధన చేయాలని , పదోన్నతులు చేపట్టి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పేరిట సమీపంలో వున్న ఉపాధ్యాయులను దూర ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులు నిర్వర్తించాలని డిప్యుటేషన్లు వేయడం ఏంటని నిలదీశారు.

## శ్రీధర్‌రెడ్డిపై ఆత్మహత్యాయత్నం కేసు నమోదు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తికి చెందిన సామానుశ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదుచేసినట్లు టుటౌన్ పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా శ్రీకాళహస్తిలో చర్చనీయాంశంగాను, సంచలనం సృష్టించిన శ్రీధర్‌రెడ్డి ఆత్మహత్య సంఘటనకు పోలీసులు కేసు నమోదు చేశారు. అంతేకాక శ్రీధర్‌రెడ్డి తండ్రి సామానువెంకటనారాయణరెడ్డి జరుగుతున్న సంఘటనలపై పోలీసులకు పిర్యాదుచేశారు. ఆయన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసినట్లు సిఐ భాస్కర్‌నాయక్ తెలిపారు. ఆయనతో పాటు ఆయన అనుచరులు శివకుమార్‌రెడ్డి, కాసరంబాలాజీ, రత్నంగౌడ్, మునీశ్వరరెడ్డి, కోటేశ్వరబాబులమీద కూడా కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

### ఉష్ణోగ్రతలు

5/12/2022



- తిరుపతి 30 డిగ్రీలు
- చిత్తూరు 31 డిగ్రీలు
- మదనపల్లి 25 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 31 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 32 డిగ్రీలు

### బంగారం ధరలు

5/12/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,045

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,504

### కోడిగ్రుడ్ల ధరలు

5/12/2022



కోడిగ్రుడ్డు :రూ.6.00

1 డజను: రూ.72.00

## తెదేపా నేత బేటప్ప మృతి.. చంద్రబాబు సంతాపం

కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



మండలంలోని వరమనూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బేటప్ప మృతి చెందారు. గత కొంతకాలంగా ఈయన అనారోగ్యంతో బాధపడుతూ సోమ వారం మృతి చెందారు. ఈయన మృతిపట్ల తెదేపా అధినేత చం ద్రబాబునాయుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బేటప్ప ఆత్మకు శాంతి కలగాలని బాధిత కుటుం బంత్వరగా కోలుకునేలా వారికి మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడ్ని ప్రార్థిస్తు న్నట్లుపేర్కొన్నారు.అలాగేపలువురుతెదేపానేతలు బేటప్పకు నివాళులు అర్పించారు.

## వైకాపా పాలనలో బిసిలకు తీరని అన్యాయం - తెదేపా నేతలు

కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



మూడున్నర ఏళ్ల వైకాపా పాలనలో బిసిలకు తీరని అన్యాయం జరుగుతోందని తెలుగుదేశం పార్టీ నేతలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలో మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మురళి, కుప్పం మండల అధ్యక్షుడు ఈశ్వర్,మున్సిపల్ బిసి సెల్ అధ్యక్షుడు సతీష్ అధ్వర్యంలో ర్యాలీనిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో బిసిలు 60శాతంకు పైగా ఉన్నారని బిసిలకు తగు గుర్తింపు లేకుండాపోయిందన్నారు. ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని, కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. బిసిలకు సబ్‌ప్లాన్ అమలు, ఆదరణ పథకం కొనసాగింపు, జిఒ నెం 217ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి నేతలపై ఉన్న కేసులు రద్దు చేయాలన్నారు. అనంతరం డి.టి.రెడ్డెప్పరెడ్డికివినతిపత్రంఅందించారు.నేతలుసాంబశివం ,శాంతారా ం, మంజునాథ్, జయరాం నాయుడు, విష్ణు, ఎంపిటిసి శ్రీనివాసులు, ఐటిడిపి నరేష్, కౌన్సిలర్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సౌకర్యం - ఎంపిపి అశ్విని

కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతో సౌకర్యంగా మారిందని ఎంపిపి అశ్విని మురుగేష్ పేర్కొన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఇంటర్న్‌షిప్ నిమి త్తం వివిధ కళాశాలలనుంచి వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో ఇంటర్న్‌షిప్ చేసే విద్యార్థులు అక్కడి ప్రజలకు అందించే వివిధ రకాల సేవలను అధ్యయనం చేయాలన్నారు. అలాగే విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వా ములు కావాలన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా మలిచారన్నారు. కార్యక్రమంలో కత్తి వినయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మూడున్నర ఏళ్లలో బిసిల బతుకులు చిదిమేశారు

– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

శాంతిపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త



మూడున్నర ఏళ్ల వైకాపా పాలనలో బిసిల బ్రతుకులు చిదిమే శారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం మండల కార్యాలయం ఎదుట ఇదేం ఖర్మ – బిసిలకు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెం 217ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బిసి నేతలపై ఉన్న కేసులు రద్దు చేయాలన్నారు.ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని, కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. బిసిలకు సబ్‌ప్లాన్ అమలు, ఆదరణ పథకం కొనసాగించాలన్నారు.అనంతరం తహశీల్దార్ లోకేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్‌నాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఈడిగ రమేష్, నాగరాజు, బసవరాజు,నాగరాజు,చంద్ర,గోపాల్,మంజునాథ్‌రెడ్డి,గోవిందరాజులు, మునేగౌడు, చంద్రకళ, అనసూయ, సుగుణమ్మ, రూప, హేమలత, శ్యామలమ్మ, మండల బిసి సెల్ అధ్యక్షుడు చలపతి పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలపై శిక్షణ కార్యక్రమం

కుప్పంరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



మండలంలోని దాసేగానూరులో రైతులకు సోమవారం ఉద్యానవన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ నాగపద్మిని, ఎఒ లక్ష్మీ ప్రసన్న, ఉద్యానవన అధికారి డింపు ప్రియ అధ్వర్యంలో రైతులకు టమోటా, మిరప పంట సాగుపై అవగాహన కల్పించారు. అలాగే సస్యరక్షణ పద్ధతులు, ఎరువుల వాడకం తదితరాలపై వివరించారు. ఈ సందర్భంగా మట్టి పరీక్షల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురుగేష్, విహెచ్ఎ చంద్ర, రైతులు పాల్గొన్నారు.

## అల్టిమేట్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక

సదుం,డిసెంబరు 5 ప్రభాతవార్త



మండల పరిధిలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు మరో ఘనతను సాధించారు. గతంలో రాష్ట్ర స్థాయిలో క్రీడలలోను, పలు పోటీలలోను పాల్గొని అనేక పతకాలు సాధించారు. తాజాగా హైదరా బాదులో నిర్వహించిన క్విజ్ పోటీలలో మంచి ప్రతిభ చూపారు. ఇందులో భాగంగా డిసెంబరు4న హైద రాబాదులో నిర్వహించిన క్విజ్‌పోటీలలో బహుమతులు సాధించారు. వీరిని సోమవారం పాఠశాలలో జడ్పీమాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి అభినందించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసు లురెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

## నేడు పులిచెర్లలో మామిడి రైతుల సదస్సు

కల్లూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త

పులిచెర్ల లోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మామిడి రైతుల సదస్సు కార్యక్రమం ఉంటుందని హార్టికల్చర్ అధికారిణి సంతోషికుమారి తెలిపారు. మామిడి పంట సాగులో అధిక దిగుబడులపై శాస్త్రవేత్తలు సూచనలు సలహాలు అందిస్తారనిరైతులు పాల్గొనాలని కోరారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

కల్లూరు,డిసెంబరు 5 ప్రభాతవార్త



మండల పరిధిలోని దేవళంపేట శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో మార్గశిర మాసం సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఫణిప్రకాశ్ శర్మ అర్చనలు జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద ఎత్తున స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు వినియోగించారు.

## గౌడసంఘం అధ్యక్షుడిగా డా.వెంకటేశ్వర్లు

యర్రావారిపాలెం, డిసెంబరు 5 ప్రభాతవార్త



చంద్రగిరి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడుగా డాక్టర్ వెంకటేశ్వర్లు ఎంపికైనారు. ఆయన ఎల్లమంద పంచాయతీకి చెందిన వ్యక్తి. ఆయన అందరికి సుపరిచితులు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడుకోకుల బంధువులకు ఏ కష్టం వచ్చిన అందుబాటులో ఉండి ఆదుకుంటానని ఈ సందర్భంగా చెప్పారు.

## బీసీలకు మూడున్నరేళ్లుగా అన్యాయం

రొంపిచెర్ల, డిసెంబరు 5 ప్రభాతవార్త



రాష్ట్ర వ్యాప్తంగా జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు మూడు న్నరేళ్లుగ అన్యాయం జరుగుతోందని బీసీ సాధికార సమితి,పాల ఏకిరి కులం రాష్ట్ర కమిటీ మెంబర్ నారాయణస్వామి అన్నారు. సోమవారం ఆయ న రొంపిచెర్ల తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చేతివృ త్తులు, కులవృత్తులు చేసుకుంటూ జీవనం సాగించే బీసీల అభివృద్ధి పురోభివృద్ధి మృగ్యమై పోయిందన్నారు. బీసీలు హక్కుగా పొందిల్సిన సబ్ ప్లాన్ నిదుల నుండి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు వరకు ప్రతి అంశంలో నిరాధరణకు దగాకు గురువు తున్నారన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక రూపాయి కూడా ఖర్చుచేయలేదని పైగా కార్పొరేషన్,సబ్ ప్లాన నిదులనుమళ్లించి బీసీలకు అన్యాయం చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రద్దు చేసిన 10 శాతం రిజర్వేషన్ల పునరుద్దరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, అందుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. షరతులు లేకుండా విదేశీ విద్య పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవోనెంబరు 217ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బంగారు నారాయణస్వామి, మల్లయ్య, నాగరాజ తదితరులుపాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయం ఎదుట దళిత సంఘాల ధర్నా

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త



కుప్పం ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం వివిధ దళిత సంఘాల నేతలు, మృతుడు ఏలుమలై భార్య పవిత్ర, కుటుంబీ కులు ధర్నా చేపట్టారు. రామకుప్పం మండలం 89 పెద్దూరుకు చెందిన ఏలుమలై మృతి కేసులో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పవిత్రకుటుంబానికిఅధికారులుతగున్యాయంచేయకుంటే ఉద్యమి స్తామన్నారు. మృతి కేసులో తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపితే వారిపైనేకేసులు నమోదు చేయడం దారుణమన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందించారు.

## కెసి హాస్పిటల్‌చే ఉచిత దంత వైద్యశిబిరం

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

స్థానిక గుడుపల్లె రోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి అధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 120మంది విద్యార్థులకు దంత పరీక్షలునిర్వహించిఉచితంగామందులు,డెంటల్ కిట్లను అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రియాజమాన్యం డా॥ మంజునాథ్, డా॥ బాలాజీ, డా॥ చైతన్య, డా॥ కావ్య, హెచ్ఎం కెవి శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వాస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్

కుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త



కుప్పం ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఆదేశించారు. సోమవారం ఏరియా ఆస్పత్రిలో ఛైర్మన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భం గా వార్డుల్లో రోగులతో మాట్లాడారు. ఇక్కడ అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. అలాగే ఆస్పత్రిలో రోగులకు అందించే ఆహారంను పరిశీలించారు. రోగులకు మంచి ఆహారం అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం సిబ్బంది పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న వైద్యులు, సిబ్బంది, నర్సుల కొరతపై సూపరింటిండెంట్ డా॥ రాజనీల రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్సీ భరత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఏరియా ఆస్పత్రిని నాడు –నేడు కార్యక్రమంలో మరింత అభివృద్ధికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కమీషనర్‌రవిరెడ్డి,సలహాదారుఆర్.శ్రీనివాసులు,కౌన్సిలర్లుసయ్యద్‌అలీ, గణపతి, నాగరాజు, రాజ్‌కుమార్, మోహన్‌రాం,అరవింద్,వెంకటరామన్న,నేతలుమురుగన్,హనుమంతు,మంజు,దేవా పాల్గొన్నారు.

## రాష్ట్ర భవిషత్తు గాలికి వదిలిన ప్రభుత్వం

పలమనేరు,డిసెంబరు 5 ప్రభాతవార్త:



వైకాపా ప్రభుత్వం రాష్ట్ర భవిషత్తును గాలికి వదలిందని టిడిపి నాయకులు విమర్శించారు.సోమవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మున్సిపాలటీలోని 21వ వార్డులో టిడిపి నాయకులు పర్యటించారు.ఈ మేరకు ప్రజలతో వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిషత్తును ప్రభుత్వం గాలికి వదిలిందని, సంక్షేమాల పేరుతో ప్రజలను మాయచేస్తుందని విమర్శించారు.రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి జరగలేదని గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన పరిశ్రమలను సైతం వెళ్లగొడుతున్నారన్నారు.రాష్ట్రానికి ఆదాయ మార్గాలు లేనందున ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడుతున్న విషయం ప్రజలు గుర్తించాలన్నారు.రాష్ట్ర భవిష్యతు కోసం ప్రజలు టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్బీసి కుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన

బైరెడ్డిపల్లె,డిసెంబరు 5,ప్రభాతవార్త:

మండలలోని గౌనితిమేపల్లె గ్రామంలో ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై సోమవారం అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు.సీజనల్ వ్యాధుల నివారణ పై అవగాహన,వ్యక్తిగత పరిశుభ్రత,పోషకాహారం తదితర అంశాపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

సదుం, డిసెంబరు 5 ప్రభాతవార్త

మండల పరిధిలో గడప గడపకు కార్యక్రమంలో వచ్చిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీపీ ఎల్లప్ప, జడ్పీటీసీ సోమశేఖరరెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి గడప గడపకు కార్యక్రమం కింద రూ.20లక్షలు మంజూరైనాయన్నారు. ఆ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని సూచించారు. అదేవిధంగా కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి జనవరి నుంచి వచ్చేలా కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. పరిపాలన వికేంద్రీకరణ కొరకు ప్రభుత్వం సచివాలయాలు ఏర్పాటు చేసిందని చెప్పారు.ఇకపై ప్రతి నెల సచివాలయాలను తనిఖీ చేస్తామన్నారు. కాలనీ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో తహశీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసుకుంటూ తమ ఆధీనంలోఉన్న భూములకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వనున్నామని, వెంటనే రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సింగిల్ విండోఅధ్యక్షుడు తిమ్మారెడ్డి మాట్లాడుతూ రైతులకు దరఖాస్తు చేసుకున్న వారంలోనే డీసీసీ బ్యాంకు ద్వారా రూ.10లక్షల వరకు రుణాలు అందజేస్తామన్నారు. మూలపల్లెకు బోరు వేశారు కాని ట్రాన్స్‌పార్మర్ బిగించలేదని సర్పంచి మల్లికార్జున నాయుడు కోరారు. రెడ్డివారిపల్లె కురవపల్లెకు బోరు వేశారు, ట్రాన్స్‌పార్మర్ పెట్టలేదని సర్పంచి హనుమంతురెడ్డి ఫిర్యాదు చేశారు. గత సమావేశంలో విద్యుత్ సమస్యలను విన్న వించినా ఇప్పటి వరకు పలు తీరక పోవడంతో ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి పిఎ మురళీకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు అమరావతి, ధనంజయరెడ్డి, పశువైద్యాధికారి తబ్రైజ్ భాషా, వైద్యాధికారి చరణ్, ఎంపీటీసీలు, సర్పంచిలు, అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రాష్ట్రంలో వైసీపీ నిరంకుశ పాలన

కోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త



రాష్ట్రంలో వైసీపీ దుర్మార్గపు నిరంకుశ పాలనకు తెరదించే సమయం ఆసన్నమైందని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మానాయుడుపాలెం గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజాభిప్రాయ పత్రాలు అందజేసి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహ న్‌రెడ్డి పాలనలో అవినీతి, భూకబ్జాలు, అక్రమాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, రాబోయే రోజుల్లో ప్రజా గుణపాఠం తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు జనాభా ప్రాతిపదికన 56 కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. చేనేత కళాకారులకు రాయితీపై పలు పథకాలు పునరుద్ధరించాలని చెప్పారు. బీసీలను అణగదొక్కింది వైసీపీ ప్రభుత్వమే అని ఆరోపించారు. మండల టీడీపీ కన్వీనర్ ఎం.సర్వోత్తమరెడ్డి, జలీల్ అహ్మద్, కె.మధుసూదన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తడలో వేనాటి మునిరెడ్డి వర్ధంతి

తడ, డిసెంబర్ 5 ప్రభాతవార్త



తడలో సోమవారం దివంగత తెలుగుదేశం పార్టీ నాయకులు వేనాటి మునిరెడ్డి 22వ వర్ధంతిని జరుపుకున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేసిన వేనాటి సేవలను పలువురు గుర్తు చేసుకున్నారు. స్థానిక బస్టాండు సెంటర్‌లో మునిరెడ్డి చిత్రపటానికి పూజలు చేసి నివాళి అర్పించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, మాజీ జడ్పీటీసీ బొమ్మన్ శ్రీధర్, టీడీపీ నాయకులు ఆర్.నీలకంఠం, కె.సెల్వం, శివాజీ, జీవా, సుధాకర్, రవి, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక

అధ్యక్షునిగా విన్నమాల పవన్‌కుమార్

తడ, డిసెంబర్ 5 ప్రభాతవార్త



సూళ్లూరుపేట తాలూకా యూనిట్ ఆంధ్రప్రదేశ్ పంచా యతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నిక సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా వి.దేవప్రసన్నకుమార్ వ్యవహరించగా, ఎన్నికల పరిశీలకునిగా ఆనందబాబు ఉన్నారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా తడ ఎంపిడిఓ కార్యాలయంలో పనిచేస్తున్న విన్నమాల పవన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా వి.వాసుదేవయ్య, ప్రధాన కార్యదర్శిగా టి.శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా ఎస్‌డి రియాజ్ అహ్మద్, కోశాధికారిగా ఎ.సుధాకర్, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్‌కె రఫీబాషా, పి.మల్లికార్జునరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తడ ఎంపిడిఓ ఎవి మురళీకృష్ణ వీరిని అభినందించారు.

## మట్టి రోడ్డు కాదు బాబోయ్.. తారు రోడ్డు ఇది

– ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారిపై మట్టి – తరచూ ప్రమాదాలు – పట్టించుకోని సంబంధిత అధికారులు

దొరవారిసత్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

ఇవి మట్టి రోడ్లు కాదు. గ్రామాల్లో ఉన్న చిన్నపాటి రోడ్లు కాదు. చెన్నై–కోల్‌కతా ఎన్‌హెచ్ 16 జాతీయ రహదారి ఇది. కానీ, జాతీయ రహదారిగా కనిపించడం లేదు. మొత్తం జాతీయ రహదారి అంచులు, మధ్య మధ్యలో మట్టితో కప్పి కనిపిస్తోంది. ఈ మట్టి కవచాలు జాతీయ రహదారిపై ఉండటంతో ప్రమాదాలకు బాటగా నిలుస్తోంది. దీనివల్ల మోటార్‌బైక్‌లలో వెళ్లే వారికి కళ్లలో దుమ్ముధూళి పడటంతో పాటు వాహనాలు అదుపుతప్పి ఎన్నో ప్రమాదాలకు కారణమవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు టోల్‌ప్లాజా నుంచి నెలబల్లి గ్రామం సమీపం వరకు సుమారు 18 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్16 జాతీయరహదారి ఉంది. ఈ రహదారి వెంబడి ఉన్న దుకాణాలు, హోటళ్లు, దాబాలు తదితర క్రాస్ రోడ్ల వద్ద విపరీతంగా మట్టి పేరుకుపోవడంతో ఇది జాతీయ రహదారా మట్టి రోడ్డా అనే అనుమానం కలగక మానదు. అయితే జాతీయ రహదారిపై ఎప్పటికప్పుడు దుమ్ముధూళి, మట్టి తొలగించి వాహనచోదకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సి ఉంది. కానీ స్వర్ణా టోల్ వారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ఈ మట్టిపై అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి కళ్లలో దుమ్ముపడుతూ మట్టిరోడ్డులా ఉందని పలువురు అంటున్నారు. చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి మట్టి రోడ్డులా కనిపిస్తుంటే సంబంధిత అధికారులు గాని, పాలకులు గాని పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారిపై మట్టిని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

దొరవారిసత్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం గిరిజన కాలనీలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తనయాలి మాజీ సర్పంచ్ సంచి రమణమ్మ కుమారుడు సంచి శివప్రసాద్ 14వ వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఉన్న 120 మంది గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పోలిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 35 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు పి.సంపూర్ణమ్మ, ఉపాధ్యాయులు ప్రసూన, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, సుందరయ్య, శ్యామల, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పింఛన్ల పంపిణీలో దొరవారిసత్రం ప్రథమస్థానం

దొరవారిసత్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త

తిరుపతి జిల్లాలోని దొరవారిసత్రం మండలం పింఛన్లు పంపిణీ చేయడంలో మొదటి స్థానంలో నిలిచిందని ఎంపిడిఓ శింగయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామం, వార్డు వాలంటీర్ల ద్వారా సరైన సమయంలో ప్రతి ఒక్కరూ ఇంటింటికి వెళ్లి పింఛన్‌దారులకు పింఛన్ అందిస్తున్నారని తెలిపారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రత్యేక చొరవ తీసుకొని సుదూర ప్రాంతాల్లో ఉన్న వారికి కూడా సకాలంలో పింఛన్లు అందజేసి శభాష్ అనిపించుకుంటున్నారని కొనియాడారు.

## అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

కోట, డిసెంబర్ 5 ప్రభాతవార్త



కోట మండలం తిన్నెలపూడి పంచాయతీలోని తాటితోపు కాలనీలో మానికల సుబ్బరామయ్య అనే గిరిజనుడి పూరిల్లు సోమవారం రాత్రి అగ్నిప్రమాదానికి ఆహుతైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. సుమారు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో రావడంతో రూ.30 వేల వరకు నగదు కాలిపోకుండా కాపాడారు. గిరిజన కుటుంబాన్ని మానవతాదృక్పధంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## భూస్వాముల నుండి కాపాడండి

వాకాడు, డిసెంబర్ 5, ప్రభాతవార్త



భూస్వాముల ఆగడాల నుండి కాపాడాలని సోమవారం వాకాడు ఇన్చార్జి తహశీల్దార్ సారంగపాణికి బుర్ల వారి పాలెం గ్రామస్తులు వినతి పత్రం అందజేసారు. వారి వివరాలు మేరకు వాకాడు మండలం ఎర్రగాటిపల్లి పంచాయితీలోని బుర్లవారిపాలెం దళితవాడలో దళితులు 40 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. ఎర్రగాటిపల్లి చెరువు నీటితో, బోర్లతో వారి చిన్నచిన్న సొంత పొలాలను సాగు చేసుకుంటూ జీవనాధారం చేస్తున్నారు. ఎర్రగాటిపల్లి చెరువు నుంచి నాలుగు తూములు, పంట కాలువలు మొలగునూరు చెరువుకి కొన్ని సంవత్సరాల నుంచి నీరు వెళుతూ ఉంటాయి. అదే గ్రామంలో నివసిస్తూ ఉన్న బుర్లా వెంకటసుబ్బారెడ్డి, బుర్గా రమణారెడ్డి, బుర్లా దామోదర రెడ్డి సుమారు 140 ఎకరాలు సాగు చేస్తూ వారి స్వార్ధం కోసం ఎర్రగాటి పల్లి చెరువు నుంచి వచ్చే పంట కాలవలను పూడ్చివేసి ఆ భూమిని వారి సొంత భూములలో కలుపుకొని నీటిని పోనీయకుండా వారి పోలాలలో మట్టి ఎత్తు తొలుకొని దళతులను అడ్డుకుంటున్నారు. దీనివలన దళితుల భూములు వర్షాకాలంలో వేసిన పంట నీటిలో మునిగిపోయినీరు వెళ్లకుండా పంట మునిగిపోయి ప్రతి సంవత్సరం పంట పాసిపోయి నష్టపోతున్నామని ప్రజల ఆవేదన చెందుతున్నారు. ఎన్నో సంవత్స రాలుగా ప్రభుత్వం మా జీవనాధారి కోసం పంట పొలాలకు కాలువలను ఏర్పాటు చేసి మాకు సహాయం చేసిందని ఇప్పుడు మా న్యాయమైన ఆవేదనను వ్యక్తంచేశామన్నారు. ఇన్చార్జితహశీల్దార్ సారంగపాణి స్పందించితగుచర్యలుతీసుకుంటామని వారికి తెలిపారు.

## పంచాయితీల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి

ఓజిలి, డిసెంబర్ 5, ప్రభాతవార్త



పంచాయితీల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని గూడూరు డిఎల్‌పిఓ వెంకటరమణ పంచాయితీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం ఓజిలి ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పం చులు, పంచాయితీ కార్యదర్శులకు జీఎఫ్ డీపీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయితీల్లో 2023 – 2024 సంవత్సరానికి సంబంధించి అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. గ్రామాల్లో అందరికీ అందుబాటులో, వారి అవసరాలకు తగినట్లుగా పనులు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రజనీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ రెడ్డి, ఈఓపిఆర్‌డి సిరాజ్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులకు పరామర్శ

గుడిపాల, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

శబరిమల యాత్ర తిరుగు ప్రయాణంలో బస్సు ప్రమాదానికి గురై తమిళనాడు రాష్ట్రం వేలూరుకు సమీపంలోని ఆడుక్కుంబారీ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం మాజీ ఎంపిపి దీపశ్రీ అనిల్ పరామర్శించారు. డిసెంబర్ 2వ తేదీ శబరిమల యాత్ర పూర్తి చేసుకొని బెంగళూరు–చెన్నై రహదారిలో వేలూరుకు సమీపంలో రోడ్డు ప్రమాదం జరుగింది. ఈ ప్రమాదంలో 14 మంది గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆడుక్కుంబారీ ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. వీరిని సోమవారం చిత్తపార దేశం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పరామర్శించి కోలుకోవాలని ఆకాంక్షించారు.

## తవణంపల్లెలో టీడీపీ 'ఇదేం కర్మ మన రాష్ట్రషానికి' వినూత్న నిరసన

తవణంపల్లె, డిసెంబర్ 5 ప్రభాతవార్త:



తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంను మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం వినూత్నంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దిలీప్‌నాయుడు, జొన్నగురకల మధుకుమార్‌లు ఆధ్వర్యంలో బిసీలకు వైకాపా ప్రభుత్వం చేస్తున్న అన్యాయం గురించి, జీఓ నెం.217 రద్దు చేయాలని, బిసీలకు రావాల్సిన సబ్సిడీలను యధావిధిగా అందించాని డిమాండు చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మోకాళ్ళపై మోకరిల్లి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డీటీ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు అరగొండ గిరిబాబు, మురళి, శరవణ, చంద్రబాబు, సునీల్, మధు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పాలు, పండ్లు పంపిణీ

బంగారుపాళ్యం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుత్ను రోగులకు సోమవారం పాలు, పండ్లు పంపిణీ చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌బి హిమకర్‌రాజా జన్మదినంను పురస్కరించుకొని ఆయన అభిమానులు రోగులకు పాలు, రొట్టె పంచిపెట్టారు. అంతకుముందు ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామరాజు, భాస్కర్, బాలాజీరెడ్డి, రఘుపతిరాజు, సురేంద్ర, సర్దార్, కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలగురునాథేశ్వర ఆలయంలో కార్తీకదీపం ఉత్సవాలు

పాలసముద్రం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

పాలసముద్రం పంచాయతీ శ్రీబొమ్మరాజపురం గ్రామంలో 400 సంవత్సరాల చరిత్ర కల్గిన బాల గురునాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీకదీప ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుండి ఆలయంలో కార్తీకదీప ఉత్సవాలను వైభంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా వాలంటీర్ల దినోత్సవం

చిత్తూరు రూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరు రామ్‌నగర్‌కాలనీ డిడియుజికె ట్రైనింగ్ సెంటర్‌లో సోమవారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ, నెహ్రు యువకేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాలంటీర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ సయ్యద్ సర్దార్ మాట్లాడుతూ వాలంటీర్లు తాము చేయనున్న పనులపై పూర్తి అవగాహన కలిగి వుండి పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. పీపుల్ స్కిల్ ప్లేస్మెంట్ ఆఫీసర్ చిరంజీవి మాట్లాడుతూ యువత సేవా భావం పెంపొందించుకొని నిస్వార్థంగా, రాగ ద్వేషాలకు అతీతంగా సమాజానికి సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువ కార్యకర్తలు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## బురదమయంగా కాలనీ వీధులు

ఓజిలి, డిసెంబర్ 5, ప్రభాతవార్త



ఓజిలి మండలంలోని రావిపాడులో కాలనీలో రహదారులు బురదతో అధ్వానంగా ఉన్నాయి. ఇటావల కురుస్తున్న వర్షాలకు రహదారులకు ఛిద్రమై కనీసం నడవలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధులలో సిమెంటు రోడ్లు ఉన్నప్పటికి వర్షాలు పడినప్పుడు ప్రజలు బురుదలో నడవలేక నానా తంటాలు పడుతున్నారని వాపోతున్నారు. ఆయా కాలనీలలో రహదారులు ఎక్కడపడితే అక్కడ బురదమయంగా ఉండడంతో నీరు నిలిచిపోయి ప్రయాణాలకు ఆటంకం కలుగుతుందని విద్యార్థులు స్కూళ్లకు వెళ్లాలన్న రైతులు పోలాలకు వెళ్లాలన్న చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల వాహనాలు, విద్యార్థులు, కూలీలు, బురదలో గమ్యానికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు జారి కిందపడి ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. కనీసం ఇటువంటి సమయంలో అధికారులు, పాలకులు స్పందించి కనీస మరమ్మతులు చేపట్టి రహదారిని కల్పిస్తే బాగుంటుందని కాలనీ వాసులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీల నందు రోడ్లపై బురదను తొలగించి యుద్ధ ప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# దేవస్థానం సమాచార కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు

## -సమాచార కేంద్రాల పునరుద్ధరణ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు సమగ్ర సమాచారం అందించుటకు బస సదుపాయాలు, ఆలయంలో నిర్వహించే సేవలకు సంబంధించి తెలియజేయుటకు సోమవారం ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ముఖ్యంగా ఆలయానికి రైలులో అత్యధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ఆలయానికి సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వటానికి సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు.ఇక్కడకు వచ్చే భక్తులకు సమాచారం లేదని గతంలో రైల్వేస్టేషన్, కృష్ణారెడ్డి మండపం, బిక్షాల గాలిగోపురం సమీపంలో సమాచార కేంద్రాలుండేవి అయితే గత




కొంత కాలంగా వాటిని అధికారులు ఎందుకోమూత వేసారు. దీనిపై విమర్శలు రాగా చైర్మెన్ శ్రీనివాసులు సోమవారం అక్కడ పరిస్థితి పరిశీలించారు. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సమాచారం కేంద్రం ఎందుకు మూత పడిందనే అంశంపై పరిశీలించారు.

అధికారులతో కలసి పరిశీలన:

శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్ వద్ద సమాచార కేంద్రం ఏర్పాటుకు సంబంధించి చైర్మెన్ రైల్వేస్టేషన్ అధికారులు మన్‌మోహన్‌కృష్ణ పూర్ణచంద్రరావు తదితరులతో కలసి చర్చించారు. ఇక్కడ ఏర్పాటు చేసి ఉన్న సమాచారం కేంద్ర గది శిథిలమైనట్లు గుర్తించారు. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన మైకు పాడైపోయింది.ఈ అస్తవ్యస్త విధానాలను గుర్తించిన చైర్మెన్ స్థానిక పోలీసులు, దేవస్థానం అది కారులతో చర్చించారు. ఇక్కడ సూచిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని ఎఇఇ వేణుగోపాల్, వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్‌లకు సూచించారు.ఇక్కడ అన్ని భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ ఆటో డ్రైవర్లు దేవస్థానంతో సహకరించాలని భక్తులను భగవంతులుగాభావించిసేవలందించుటలో సహకరించాలని చైర్మెన్ కోరారు

## బిసిలకు రాజ్యాంగ రక్షణ లేదా?

డాక్టర్ యం.ఉమేష్‌రావు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు బిసిలకు రాజ్యాంగ రక్షణ కరువైందని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల దురంహాకారాన్ని నరనరాన జీర్ణించుకున్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు తమ ఆటవిక చర్యలతో ప్రతిపక్ష పార్టీలకు చెందిన బిసి నాయకత్వాలను అంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. పుంగనూరు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మరియు సామాజిక కార్యకర్త అయిన రామచంద్రయాదవ్‌ను అంతమొందించాలన్న ఉద్దేశ్యంతో నిన్నటి రోజున వైకాపా అల్లరి మూకలు దౌర్జన్యంకు దిగడాన్ని అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ నిస్తేజంగా ఉండడం అత్యంత దౌర్భాగ్యం అని ఆరోపించారు. రాజ్యాంగ పరమైన తమ హక్కులను చట్టానికి లోబడి అనుభవించడానికి రామచంద్రయాదవ్‌కు గల అడ్డంకులను పోలీసులు తొలగించి ఆయనకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బిసి విభాగం నాయకులు బీమాల భాస్కర్‌ముదిరాజ్, చిల్లకూరుమణి, వీరయ్య, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిక

శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త



పట్టణంలోని నాలుగోవార్డులో ఉన్న వైఎస్ఆర్‌సిపి పార్టీకి చెందిన తొండంబట్టుశ్రీను మరియు మిత్రులు సుమారు 50మంది తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గతంలో వైకాపా పార్టీ విధి విధానాలకు విసిగి వేసారి తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగిందని అనేక సంక్షేమ కార్యక్రమాలు ఎస్సీలకు అనుకూలంగా సబ్సిడీ రుణాలు, విదేశీ విద్య, రైతు రథం, నిరుద్యోగభృతి, ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులుతో అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని కానీ నేడు ఇవన్నీ కనుమరుగయ్యాయని సుధీర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గాదిపాకుల గోపి,తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్ చుక్కల రమేష్, నియోజకవర్గ ఎస్సీ అధ్యక్షుడు సన్నీ, పట్టణ అధ్యక్షుడు, పార్లమెంటు ఎస్సీసెల్ నాయకులు వెంకటసుబ్బయ్య, ప్రభాకర్, భాస్కరయ్య, మణి, కయ్యూరుదిలీప్, తిరుమలేశు, దయనేడుదనంజయులు, కోబాకలక్ష్మణ్,, మిన్నల్‌రవి, పాపిరెడ్డి, చెంచయ్యనాయుడు, మునిరాజనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, గాలిమురళీనాయుడు, మణి, సుబ్బయ్య, మునిరాజయాదవ్, బాలాజీరెడ్డి, సునీల్‌కుమార్, బషీర్, దుర్గ, వినయ్, పవన్, భార్గవ్, గుత్తావిజయకుమార్‌తదితరులు పాల్గొన్నారు.

## 7న టిటిడి విద్యా సంస్థల్లో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 5, ప్రభాతవార్త

టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ పిజి కళాశాలల, శ్రీ గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాల, శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య (ఒరియంటల్) కళాశాలలో 2022 - 23 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సుల్లో చేరదలచిన విద్యార్థులకు డిసెంబర్ 7వ తేది స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి, జగనన్న విద్యాదీవెన,జగనన్నవసతిదీవెనవర్తింస్తుందన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి..ఎంఎల్ఏ

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త



అర్హులైన ప్రతి ఒక్కరికి జగనన్న పథకాలు అందాలని శాసనసభ్యుడు బియ్యపుమధుసూదన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి మండలంలోని వేడాం సచివాలయం పరిధిలోని రామాపురం మరియు అబ్బాబట్లపల్లి గ్రామాల్లో ఎంఎల్ఏ పర్యటించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏకు రామాపురం సర్పంచ్ బాలిరెడ్డి, పలువురు వైకాపా నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అని తెలుసుకున్నారు. అనంతరం ఎంఎల్ఏను భారీ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలోపలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## జయహో బిసి మహాసభలకు తరలిరండి

-ఏపి బిసి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈనెల 7వతేదీన బుధవారం నిర్వహించే జయహో బిసిల సభలకు బిసిలందరు తరలిరావాలని ఏపి బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ బిసి సంఘ అధ్యక్షుడు దేరంగుల ఉదయకిరణ్ ఆదేశాల మేరకు విజయవాడలో సభను నిర్వహిస్తున్నామని వైసిపి బిసి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే సభకు ఏపి బిసి సంఘం మద్దతు తెలుపుతోందన్నారు. బిసిలంటే వెనుకబడిన కులాలు కాదని, సమాజానికి వెన్నెముక అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బిసిలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో బిసిలందరు వైకాపాకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం

అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 5, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన డయిల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటి మేయర్ ముద్ర నారాయణలు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. మంచి నీళ్ళ గుంటలో చెట్లు పెరిగిపోయి అపరిశుభ్రంగా వుందనే ఫిర్యాదుపై వారు స్పందిస్తూ పరిశీలించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కరకంబాడి రోడ్ రాజారెడ్డి నగర్‌లో సైడు కాలువలు నిర్మాణం సగం మాత్రమే చేసారనే ఫిర్యాదుపై ఇంజనీరింగ్ అధికారులు వచ్చి పరిశీలించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. సిపిఎం పార్టీ తరుపున వచ్చిన ఫిర్యాదుల్లో గంగమ్మ గుడి దగ్గర డ్రైనేజి వర్క్ చేసారు. దానిని ఇంకా పూడ్చి లెవల్ చేయలేదని, సుందరయ్య నగర్‌లో కాలువలు రిపేరు చేయాలని, శ్రీనగర్ ఆరవ క్రాస్‌లో నాలుగు రోజులుగా నీటి సరఫరా లేదని ఫిర్యాదులు చేయగా, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. గిరిపురంలో డ్రైనేజీ నీరు గత ఐదు నెలలుగా పొంగుతున్నదని శాశ్వత పరిష్కారం తీసుకుకోవాలనే ఫిర్యాదుపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామి రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ, రెవెన్యూ ఆఫీసర్లు లోకేష్ వర్మ, సేతు మాధవ్, సెక్రటరి రాధికా, మేనేజర్ చిట్టిబాబు, శానిటరి సూపర్‌వైజర్ సుమతీ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశాన ఆక్రమణలను తొలగించండి..!

ఎంపిపికి చంద్రగిరి సర్పంచ్ వినతి



చంద్రగిరి, డిశంబర్ 5 ప్రభాతవార్త:

స్థానిక శ్రీ వీరబ్రహ్మంగారి ఆలయం వద్ద శ్మశాన వాటిక ఆక్రమణలను తొలగించాలని కోరుతూ పంచాయతీ సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డికి ప్రజలు వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటిక ఆక్రమణలతో మరణానంతరం భౌతిక దేహాల ఖనానికి స్వర్ణముఖీనదిలోకి వెళ్ళవలసివస్తున్నట్లు తెలిపారు. ఆక్రమణలను తొలగించి శ్మశాన వాటికను పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయంపై ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషాతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఎంపిపి హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర నాయకుడు మస్తాన్, ఎల్లమ్మ ఆలయ మాజీ సభ్యుడు కోలా అనిల్, బాలజీ, రాజశేఖర్ రెడ్డి, తదితరులు వున్నారు.

## రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం..!

రామచంద్రాపురం, డిసెంబర్ 5 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రగతి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టిడిపి చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు అన్నారు. సోమవారం కమ్మపల్లి పంచాయతీలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పర్యటించి రోడ్ల దుస్థితి, ప్రభుత్వ అరాచకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు మట్టిని సైతం విడిచిపెట్టడం లేదన్నారు. ప్రభుత్వ భూములు దురాక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జనార్దన్ చౌదరి, రావిళ్ళ గిరి, జెడి జగన్, వసంత నాయుడు, రవి, సుబ్రమణ్యం యాదవ్, కందల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఫలపుష్ప అలంకరణలతో శ్రీమల్లేశ్వరస్వామి

చంద్రగిరి, డిశంబర్ 5 ప్రభాతవార్త:



స్థానిక కొత్తపేట, ఆర్ఎఫ్ రోడ్డులోని శ్రీ శ్యామలా సమేత మల్లేశ్వర స్వామి (పుట్టాలమ్మ) వారి ఆలయంలో ఆలయ అర్చకులు శివకుమార్ శర్మ సోమవారం మూలవిరాట్‌ను ఫలపుష్పాదులతో విశేష అలంకరణ గావించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారికి ఉదయత్పూర్వమే అభిషేకం, విశేష అలంకరణలతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాల వితరణ గావించారు. భక్తులకు ఆలయ చైర్మెన్ మొక్కల వెంకట రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు, ఉత్సవ ఉభయదాతలు సేవలందించారు.

## పిఎసిఎస్ డైరక్టర్ రాజీనామా

విజయపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త :



మండలంలోని కోసలనగరం పిఎసిఎస్ సింగిల్ విండో డైరక్టర్‌గా వున్న వరదరాజులుకండ్రిగగ్రామానికిచెందినప్రతాప్‌రాజుతన పదవికి సోమవారం రాజీనామా చేశారు. ఆ మేరకు పిఎసిఎస్ సిఇఒ కుబేరుకు తన రాజీనామా లేఖ పంపించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపిలో పార్టీ ఆవిర్భావం నుంచి ఎనలేని సేవ చేసినా తగిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు మండల వైసిపి నూతన కార్యవర్గంలో కూడా ప్రాధాన్యత ఇవ్వలేదని అందువల్ల తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

## బిసిలను ఆదుకోవాలని తహశీల్దారుకు టిడిపి వినతిపత్రం

విజయపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త :



బిసిలను ఆదుకోవాలని కోరుతూ సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 50 శాతానికి పైగా వున్న బిసిలకు మూడున్నర సంవత్సరాల్లో వైసిపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని వాపోయారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా పైసా నిధులు కూడా లేకపోవడం వల్ల కార్పొరేషన్లు నామమాత్రమైపోయాయని తెలిపారు. బిసిలు హక్కుగా పొందాల్సిన సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయకుండా దగా చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల్లో రద్దు చేసిన 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలని, జిఒ నెంబరు 217ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, మండల బిసి సెల్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్, నాయకులు దశరధరాజు, గుణభూషణమ్మ, గుణశేఖరరెడ్డి, మురళి, అశోక్, పరంధామ నాయుడు, గోవిందరాజులు, గోపాల్, శరత్, ఢిల్లీనాయుడు, కపిల్, దొరైరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి మండల యూత్ నూతన కార్యవర్గం

విజయపురం, డిసెంబరు 5 ప్రభాతవార్త :



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయపురం మండల యూత్ కమిటీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. అధ్యక్షుడిగా టి.రామరాజ్, ఉపాధ్యక్షుడిగా అంగముత్తు, కార్యదర్శిగా పాతార్కాడుకు చెందిన దేవ, మహిళా అధ్యక్షురాలిగా తమిళ సెల్వి, ఉపాధ్యక్షురాలిగా ఎన్.జ్యోతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కె.రాజ, ఉపాధ్యక్షుడిగా కె.విజయన్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా టి.రాజకుమార్, బిసి సెల్ అధ్యక్షుడిగా చిట్టిబాబు, కార్యదర్శిగా మనోహర్, లీగల్ సెల్ అధ్యక్షుడిగా జి.భాస్కర్, సోషల్ మీడియా సమన్వయకర్తగా జిల్లు ఎన్నికయ్యారు.

## కైలాసనాధకోనలో కార్తీక సోమవారం సందడి

నారాయణవనం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :

కార్తీక సోమవారంతో కైలాసనాధకోనకు వందలాది మంది భక్తులు తరలివచ్చి కార్తీకస్నానం చేశారు. కార్తీక మాసంలో చేసే పవిత్రస్నానాల వల్ల పుణ్యం లభిస్తుందని భావించే భక్తులు ఉదయం 3గ ంటల నుంచే కైలాసనాధకోనలోని జలపాత ంలో పవిత్రస్నానాన్ని చేయడానికి పోటీపడ్డారు. పవిత్రస్నానాన్ని ఆచరించినతర్వాత చాలమంది భక్తులు అయ్యప్ప మాలను ధరించారు. అనంతరం కైలసనాధున్ని, కామాక్షాంభికాఅమ్మవారినిభక్తులుదర్శనంచేసుకున్నారు.టెంకాయహారతులు,నైవేద్య ం సమర్పించుకున్నా రు.

## ప్రధాని మోడీ ప్రభుత్వ ఆస్తులను దారాదత్తం చేస్తున్నారు

-మాజీ ఎంపి చింతామోహన్

శ్రీకాళహస్తి, డిసెంబర్ 5 ప్రభాతవార్త

ప్రధాని మోడీ ప్రభుత్వ ఆస్తులను తన స్నేహితులకోసం దారాదత్తం చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ మాజీ ఎంపి డాక్టర్ చింతామోహన్ అన్నారు. కాంగ్రెస్ జోడోయాత్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని విఎంపల్లిలో కాంగ్రెస్ జోడోయాత్రను నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను పంపిణీచేశారు. కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేస్తూ తిరిగి కాంగ్రెస్‌పార్టీని ఆదరించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రపంచ దేశాలను ఉద్దరించాలని 40పార్టీలతో సమావేశమై ఏమి చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వంలో అవినీతి విచ్చలవిడిగా మారిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కూలిరవికుమార్, సిద్దయ్య, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## 'వార్త'కు స్పందన



కాల్వపోరంబోకు స్థలంలో ఏర్పాటు చేసిన గేటు తొలగింపు

తిరుపతిరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

శ్రీనిలయ లే అవుట్ ముందు కాల్వపోరంబోకు స్థలంలో ఏర్పాటు చేసిన గేటును సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. 'శ్రీనిలయలో...ప్రభుత్వ భూమి ఆక్రమణకు పకడ్బందీ ఏర్పాట్లు' అనే శీర్షిక వార్త దినపత్రికలో ప్రచురితమైన విషయం తెల్సిందే. వార్త కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తిరుపతిరూరల్ తహశీల్దార్ లోకేశ్వరి ఆదేశాల మేరకు కాల్వలో ఏర్పాటు చేసిన గేటును తొలగించినట్లు వీఆర్వో తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తిరుపతిరూరల్ తహశీల్దార్ హెచ్చరించారు.

## నేలలు ఆహార ఉత్పత్తికి మూలం



-సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ రాజశేఖర్

తిరుపతిరూరల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త:

నేలలు ఆహార ఉత్పత్తికి మూలమని, నేల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డాక్టర్ రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో ప్రపంచ నేలల దినోత్సవం వేడుకలను 2015 నుండి ప్రతి ఏడాది డిసెంబర్ 5న 'ప్రపంచ నేలల దినోత్సవాన్ని జరుపుకుంటూ వస్తున్నట్లు తెలిపారు. 'నేలలు - ఆహార ఉత్పత్తికి మూలం'పై అవగాహన కల్పించాల్సిందిగా ప్రపంచ ఆహార సంస్థ నిర్ణయించడం జరిగిందన్నారు. అందులో భాగంగా సోమవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా బోధన, భోదనేతర సిబ్బంది, పాలిటెక్నిక్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి ప్రజలకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ నేల కోతకు గురికాకుండా మానవాళి కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడకపోతే ఆహార భద్రత పెనుప్రమాదంలో పడి మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. డాక్టర్ కె.వి. నాగమాధురి, ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంపొందించుటకు ఏ విధమైన పద్దతులు ఆచరించాలో తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కలీముల్లా, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ మదన్:మోహన్, డాక్టర్ భార్గవరామిరెడ్డి, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి

కేవీబీ పురం, డిసెంబరు 5 ప్రభాతవార్త:



కేవీబీ పురం మండల కేంద్రంలో సోమవారం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 8,9,10 తేదీల్లో జరిగే 29వ రాష్ట్ర మహాసభలకు మండలంలోని ప్రతి ఒక వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గోడపత్రికలు ఆవిష్కరించారు. గ్రంథాల పోలయ్య, నాగూరయ్య, తులసమ్మ, కన్నెమ్మ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన కులాలను మోసం చేస్తున్న వైకాపా ప్రభుత్వం

నింద్ర, డిసెంబరు 5 ప్రభాతవార్త :



రాష్ట్రంలోని బిసి కులాలను వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ మోసం చేస్తున్నారని టిడిపి మండల అధ్యక్షులు పేరంవెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో తహశీల్దారు అమరేంద్ర బాబుకు బిసిలకు న్యాయం చేయాలని టిడిపి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసారు. వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో బిసిల కోసం మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అనేక పథకాలు ప్రవేశపెట్టి ఆదుకున్నారని, ప్రస్తుతం వైకాపా ప్రభుత్వం వాటిని రద్దు చేసి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శిం చినారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి విజయకుమార్, నాయకులు బాబుయాదవ్,భాస్కర్, సంపూర్ణమ్మ, మహేష్,కోటి, బాబు, పెరుమాళ్ళరెడ్డి,జగన్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బయ్య మృతదేహానికి గాలి భానుప్రకాష్ నివాళి

పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:

పుత్తూరు మండలం కేబీఆర్ పురంకు చెందిన ఆత్మీయ సోదరుడు గుడిపాటి సురేష్ తండ్రి గుడిపాటి సుబ్బయ్య మృతదేహానికి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పుత్తూరురూరల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు చేసినా చేసుకున్నా కఠిన చర్యలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రోజా రమణి, గీతాంజలి, వెలుగు సీసీ గోపి సూచించారు. సోమవారం ఉత్తరపుకండ్రిగ, నేసనూరు, గోపాలకృష్ణాపురం గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో మహిళల హక్కులు-చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై వేధింపులు మానుకోవాలని, గృహహింస నేరమని, బాల్య వివాహాలు చేయరాదని, మహిళలపై పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్ నిరంజన్, సుజాత, అరుణ్ కిరణ్, సర్పంచ్‌లు బుజ్జిబాబు, గోవిందస్వామిరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనమ్మ, రూప తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ప్రోత్సాహలను సద్వినియోగం చేసుకోవాలి

వెదురుకుప్పం, డిసెంబర్ 5 ప్రభాతవార్త :



దివ్యాంగులు ప్రభుత్వం అందజేసే ప్రోత్సాహలను సద్వినియోగం చేసుకుని అందరితో సమానంగా ఎదగాలని ఎంపిడివో సుధాకర్‌రావు పిలుపునిచ్చారు. మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక పాఠశాల ఆవరణలోగల భవిత కేంద్రంలో సోమవారం మండల విద్యాశాఖాధికారి విజయకుమార్ అధ్యక్షతన అంతర్జాతీయ దివ్యాంగులు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభ వంతులను ప్రోత్సహించడం కొరకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి అవసరమైన ఉపకరణాలు అందిస్తుందని, ఉపయోగించుకుని అందరితో సమానంగా చదువుకోవాలని చెప్పారు. ఆటపోటీలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ విద్యార్థులు బహుమతులు అందజేశారు. అలాగే 16 వినికిడి యంత్రాలు, ఐదుచక్రాల కుర్చీలు, రెండు రోలేటర్లు, పంపిణీ చేశారు. అలాగే మండలంలోని యూటిఎఫ్ శాఖ ఉపాధ్యాయులు 45 మంది విద్యార్థులకు లంచ్ బాక్సులు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, వైసీపీ మండల అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హేమసుందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, పంచాయితీ కార్యదర్శి మోహన్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగంధర్, యూటిఎఫ్ నాయకులు దేశయ్య, పీతాంబరం, లోకనాథం, గురునాథం, పురుషోత్తం, జయచంద్రా రెడ్డి, కల్పన, సహిత విద్యాఉపాధ్యాయులుశ్యామల,గుణ,ఆయాహేమలత, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణతోనే అంబేద్కర్‌కు ఘనమైన నివాళి!

-అంబేద్కర్ భవన్ చైర్మన్ దుగ్గాని జయరాం



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:

బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం, వారి హక్కులను కాపాడుకోవడం కోసం లిఖించబడిన భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకున్నప్పుడే డా॥బాబా సాహెబ్ అంబేద్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని అంబేద్కర్ భవన్ చైర్మన్ దుగ్గాని జయరాం,ఎస్సీ,ఎస్టీ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.చెంగల్రాయులు అన్నారు.సోమవారం స్థానిక అంబేద్కర్ భవన్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ నేడు మంగళవారం అంబేద్కర్ 66వ వర్ధంతిని పురస్కరించుకుని,ఉదయం 11 గంటలకు అంబేద్కర్ భవన్ నుండి ఆర్టీసీ బస్‌స్టేషన్ ముందున్న అంబేద్కర్ విగ్రహం వరకు ఊరేగింపుగా వెళ్లి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిస్తామన్నారు.అనంతరం కార్యక్రమంలో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నేతలు చింతమాకుల పుణ్యమూర్తి,ఎల్.సుబ్రహ్మణ్యం, మురళి,ధనంజయులు, రామాంజినేయులు,తదితరులు పాల్గొన్నారు.

## 27న భక్త కనకదాసు జయంతి ముగింపు వేడుకలు!

-జబ్బాల శ్రీనివాసులు పిలుపు



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 5 ప్రభాతవార్త:

కురుబ కుల ఆరాధ్యదైవమైన శ్రీ భక్త కనకదాసు 535వ జయంతి ముగింపు వేడుకలు ఈనెల 27వ తేదీ మంగళవారం కురబలకోటలోని కెఎన్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ కురుబ,కురుమ,కురవ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాసులు తెలిపారు.మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఈ మేరకు జయంతి వేడుకలకు చెందిన ఆహ్వాన పత్రికను సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సంఘం ఏర్పడి 6 సం॥లు పూర్తయ్యి 7వ సం॥లోకి అడుగు పెట్టిన శుభ సందర్భంగా ఉదయం 10 గంటలకు సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశం అనంతరం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.కావున ప్రతి సభ్యుడు తమ తమ కుటుంబాలతో కలిసి హాజరయ్యి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నంజుండప్ప,మంగిరి రెడ్డెప్ప,గుండ్లూరు శ్రీనివాసులు,గుండ్లూరు నరసింహులు,కదిరి నరసింహులు,మంగిరి అశోక్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# బిసిలపై వైసిపికి సవతి ప్రేమ..టిడిపి

## -తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త

బిసిలపై వైసిపి సవతిప్రేమ చూపుతోందని తెలుగుదేశం పార్టీ నేతలు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం శ్రీకాళహస్తిలో బిసి సాధికారిక కమిటీ ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇదేం ఖర్మ అంటూ బ్యానర్లు చేతపట్టుకుని నిరసన తెలిపారు. ఈసందర్భంగా టిడిపి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56శాతం పైగా బిసిలకు వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్ర అన్యాయం



జరుగుతోందన్నారు. చేనేతలకు సబ్సిడీ పరికరాలు, వలలు, పడవలుపంపిణీనిపునరుద్దరించాలన్నారు.జివోనంబర్217ను రద్దు చేయాలనికోరుతూ తహశీల్దార్ జరీనాకు వినతిపత్రాన్ని అందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర గాండ్ల బిసి సాధికారిక సభ్యులు కన్నావరం హరిబాబు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర నాయకులు దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, రుద్రకోటిసదాశివం, కామేష్‌యాదవ్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోపి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, ఎస్టీ అధ్యక్షుడు సుబ్బయ్య, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు గుర్రప్పశెట్టి, ఉమేష్‌రావు,ఆనంద్‌గౌడ్, శ్రీలక్ష్మి, మునిరాజాయాదవ్, దొరైరాజరెడ్డి, చింతగింజల సునీల్‌కుమార్, సన్నీ, భాస్కర్, ఆర్ముగం, డివినారాయణ పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## సర్దుబాటు సమస్యల పరిష్కారంకు సత్వర చర్యలు

**- డిఇఓ విజయేంద్రరావును కలిసి విన్నవించిన ఎస్టీయు నాయకులు**

చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎస్టీయు నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు సమస్యలపై ఎస్టీయు ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటామోహన్‌లు గురువారం డిఇఓ ఛాంబర్‌లో డిఇఓ విజయేంద్రరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సీనియార్టీ నిర్ధారించే ప్రక్రియపై స్పష్టత లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో గందరగోళం ఏర్పడిందన్నారు. అలాగే టీచర్లందరి రెగ్యూలరైజేషన్, సీనియార్టీ జాబితాలను డిఇఓ వెబ్‌సైట్‌లో పెట్టాలని కోరారు. ఉన్నత పాఠశాలలతో పాటు పలు మండలాల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుపై సమస్యలు తలెత్తుతున్నాయని వీటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై డిఇఓ విజయేంద్రరావు ఎస్టీయు నాయకులతో మాట్లాడుతూ ఉన్నత అధికారుల మార్గదర్శకాలతో సర్దుబాటు సమస్యలను పరిష్కరించాల్సి వుంటుందని తెలిపారు.

## స్వేచ్ఛ జీవనం కాంగ్రెస్‌తోనే...మాజీ మంత్రి



రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త: దేశ ప్రజలంతా స్వేచ్ఛాయుతంగా జీవించింది కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రమేనని మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్ అన్నారు. భారత్ జోడో యాత్రలో భాగంగా సోమవారం రేణిగుంట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతామోహన్ ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు అన్ని సౌకర్యాలను కల్పించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. నిత్యావసర వస్తువులు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచింది గత కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. గరీబీ హటావో అంటూ ఇందిరాగాంధీ పేదరికం దేశంలో నిర్మూలించే గొప్ప ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. ఐటీ రంగాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందన్నారు. పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ ఆర్థిక విధానాలను ప్రజలకు వివరించారు. మరలా దేశానికి పూర్వ వైభవం తీసుకురాగల ఏకైక పార్టీ రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీఆర్ రావణన్, ఆయన మిత్ర బృందం, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## స్విమ్స్‌లో పాలియేటివ్ కోర్సు ప్రారంభం

తిరుపతినగరం, డిసెంబర్ 5 ప్రభాతవార్త: స్విమ్స్ హాస్పిటల్ నందు రేపటి నుండి 16వ తేదీ వరకు ఫౌండేషన్ కోర్సు ఇన్‌పాలియేటివ్ మెడిసిన్ శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా మౌళిక సదుపాయాల గురించి నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జయచంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు రాష్ట్రంలో మూడు చోట్ల పెట్టడానికి శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగా మొదటి టిటిడి దేవస్థానముల ఆధ్వర్యంలో స్విమ్స్ శ్రీబాలజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆధ్వర్యంలో పాలియేటివ్ మెడిసిన్ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. దీనిలో కొత్త బ్లాక్ ఆంకోపాథాలజీ, రేడియో డయోగ్నసిస్ వింగ్ సందుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రేపు ఉదయం 9గంటలకు శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ నందు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి టిటిడి పాలకమండలి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఇ.ఓ ఎ.వి.ధర్మారెడ్డి, వేదిక్ యూనివర్శిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి, సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ పాల్గొంటారని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు.

## జయహో బిసి సభను విజయవంతం చేయండి



నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త : బిసిలంటే వెనుకబడిన కులాలు కాదు, వెన్నెముకగా వున్న కులాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. విజయవాడలో పార్టీ తరపున నిర్వహించే బిసి సదస్సును విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో బిసి వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిసిల జీవితాల్లో వైఎస్సార్. జగన్మోహనరెడ్డి వెలుగులు నింపారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 139 బిసి కులాలకు సంబంధించి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేశారని తెలిపారు. నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో యాభై శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ చంద్రబాబునాయుడు కొత్త నాటకం మొదలు పెట్టారని ఎద్దేవా చేశారు. బాబుకు బిసిలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వి.ఎం.మాహీన్, మునిసిపల్ ఛైర్మన్లు, నియోజకవర్గ బిసి కులాలకు చెందిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## నగరి సబ్‌డివిజన్ పరిధిలో 30 యాక్ట్ అమలు

నగరి, డిసెంబరు 5 ప్రభాతవార్త : శాంతి, భద్రతల దృష్ట్యా నగరి సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 31 తేదీ వరకూ సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ 1961 అమలు చేస్తున్నట్లు డిఎస్పీ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో మతపరమైన విద్వేషాలు ఏర్పడడానికి అవకాశం వున్నట్టు వచ్చిన సమాచారం మేరకు శాంతి, భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకూడదనే ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. యాక్ట్ అమలులో వున్నందున ర్యాలీలు, నిరసనలు, ధర్నాలు చేయకూడదని స్పష్టం చేశారు. అయిదుగురు కంటే ఎక్కువ మంది గుమిగూడ కూడదని తెలిపారు. ప్రజలకు అపాయం కలిగించే ఆయుధాలు కలిగి వుండకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంత్యక్రియలకు మాత్రం సడలింపు వుంటుందని తెలిపారు.

## బిసి మహాసభను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

నారాయణవనం, డిసెంబర్ 5 ప్రభాతవార్త : బుధవారం విజయవాడలో జరగనున్న బిసి మహాసభను విజయవంతం చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని బిసి కులస్తులు అందరు తరలివచ్చి విజయవంతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి పి సుదర్శన్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇ సొరకాయులు, కోన ఛైర్మన్ ఇసుబ్రమణ్యంయాదవ్, వైస్‌ఎంపిపి శివశంకర్, కో ఆప్షన్ మెంబర్ సోడా మణిరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, సాయిరవికుమార్, మనోహర్, దిల్లీ, ధర్మలింగం, హేమచంద్రారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కలెక్టర్ వెంకటరమణారెడ్డి పిచ్చాటూరు పర్యటనకు వెళ్లగా నారాయణవనం హేవేలో ఆయన్ని దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని కోరారు.

## దిశ యాప్‌గా అవగాహన కల్పించండి - రైల్వే డీఎస్పీ షాను

రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త: మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరుపతి రైల్వే డీఎస్పీ షాను అన్నారు. రైల్వే డీఎస్పీ ఆదేశాల మేరకు రైల్వే పోలీసులు సోమవారం రాత్రి రేణిగుంట రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారంపై మహిళలకు రైల్వే పోలీసులు అవగాహన కల్పించి వారి మొబైల్ ఫోన్లలో దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. అదే విధంగా ఇటీవల కాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా ప్లాట్‌ఫాంపై తిరుగుతున్న పలువురి ఫింగర్ ప్రింట్‌లను సరి చూసుకున్నారు. తద్వారా పాత నేరస్తుల ఆచూకీని తెలుసుకునే అవకాశం ఉందని డీఎస్పీ షాను తెలిపారు. ప్రభుత్వం మహిళల కోసం ఎన్నో చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ఆ చట్టాల పట్ల వారు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. దిశ యాప్ ఎంతో ఉపయోగకరమైందని ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు ఓ నీడలా యాప్ కాపాడుతుందన్నారు. జరుగుతున్న అఘాయిత్యాలను యాప్ ద్వారా తెలియజేసే తక్షణం పోలీసులుఅక్కడికి వచ్చి రక్షణ కల్పిస్తారన్నారు. రాత్రి వరకు రైల్వేస్టేషన్‌లో చాలా మంది మహిళలకు రైల్వే ఎస్ఐ రవి సిబ్బందితో కలసి యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా పలువురి ఫింగర్ ప్రింట్ నమూనాలను సరి చూసుకున్నారు.

## మురికి నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తిరుపతి వినాయకసాగర్ ప్రక్కన నిర్మాణంలో ఉన్న మురికి నీటి శుద్ధి కేంద్రాన్ని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమఅంజలి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, పనులు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్‌కు సూచనలు జారీ చేస్తూ ఈ నెల చివరి లోపు పనులను పూర్తి చేసి ప్రారంభించేందుకు త్వరగా సిద్ధం చేయాలన్నారు. తిరుపతి నగరంలోని ఒక పార్ట్ నుండి వెలువడే మురికి నీరు గతంలో వినాయక సాగర్‌లోకి చేరడం జరిగేదని గుర్తు చేస్తూ దాదాపు 10 కోట్లతో నిర్మాస్తున్న ఈ మురికినీటి శుద్ధి కేంద్రం వినియోగంలోకి వస్తే రోజుకి 50 లక్షల లీటర్ల మురికి నీటిని వివిధ దశల్లో శుద్ధి పరిచి పూర్తి స్థాయిలో మంచి నీటిగా మార్చి వినాయకసాగర్‌కు తరలించడం జరుగుతుందన్నారు. వినాయక సాగర్ నిండిన తరువాత మిగిలిన నీటిని వ్యవసాయానికి మరలించడం జరుగుతుందని కమిషనర్ అనుపమ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, కాంట్రాక్ట్ ఇంజనీర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

## పూతదశలో జాగ్రత్తలతో మామిడిలో అధిక దిగుబడి

సదుం, డిసెంబరు 5 ప్రభాతవార్త : మామిడి పూత దశలో జాగ్రత్తలు తీసుకోవడంతోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యాన అధికారి మధుసూధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పూత దశలోతీసుకోవలసిన జాగ్రత్తలుగురించి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులుతో కలిసి వివరించారు. పూత మొదలవడానికి ముందు బోరాన్ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పునకలిపి పిచికారి చేసుకోవాలన్నారు. తద్వారా పూత బాగా తయారవుతుందన్నారు. పూత నిలబడటానికి ఆర్కా మాంగో స్పెషల్ అనేది బెంగుళూరువారిచే కొత్తగా కనుగొనపడిన పోషకం అని ఒక లీటరు నీటికి 8 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. పురుగు మందులు పిచికారి చేసినపుడు మొక్క కాండం నుంచి చిగురు వరకుతడిచేలా పిచికారి చేయాలన్నారు.

# మరపురాని మహానేత వేనాటి మునిరెడ్డి

**- మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**



సూళ్లూరుపేట, డిసెంబర్ 5 ప్రభాతవార్త : తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేసి పార్టీ కార్యకర్తలకు అండదండగా ఉంటూ మరపురాని మహానేతగా వేనాటి మునిరెడ్డి నిలిచారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేనాటి మునిరెడ్డి 22వ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. మునిరెడ్డి పార్టీని అభివృద్ధి చేయడంతో పాటు జిల్లా స్థాయిలో సూళ్లూరుపేట నియోజకవర్గానికి వేనాటి వారే పార్టీకి అన్ని విధాలుగా సహకారం అందిస్తారన్న పేరు తెచ్చుకున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడమే కాకుండా రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు మునిరెడ్డి విశేష కృషి చేశారన్నారు. పార్టీ ఆయనకు అందించిన పదవులకు న్యాయం చేసి పార్టీకి మంచిపేరు తీసుకొచ్చారని ప్రశంసించారు. మాజీఎంఎల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ మునిరెడ్డి కార్యకర్తలకు నేనున్నాను అనే భరోసా ఇవ్వడంతో పాటు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుండి నడిపించారని చెప్పారు. మాజీ టీటీడీ బోర్డు సభ్యులు వేనాటి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తన సోదరుడు వేనాటి మునిరెడ్డి అభివృద్ధి చేసి తీర్చిదిద్దిన పార్టీని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తనపై లేనిపోని అపోహలను ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కుటుంబ సమస్యల వల్ల కొన్ని రోజులుగా పార్టీ సేవలకు దూరంగా ఉన్నానని, తిరిగి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ వేనాటి మునిరెడ్డి పార్టీకి చేసిన సేవలు అమోఘమని చెప్పారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ టీడీపీ అంటేనే వేనాటి మునిరెడ్డి అని, ఆయన ఉన్నంత కాలం సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారన్నారు. మాజీమంత్రి పరసారత్నం మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇప్పటికి ఎప్పటికీ పార్టీ శాసనసభ టిక్కెట్ ఇవ్వాలంటే వేనాటి వారు చెప్పిన వారికే వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వేనాటి మునిరెడ్డి చిత్రపటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారి సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, పట్టణాధ్యక్షులు ఆకుతోట రమేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల సుఖశాంతుల కొరకే లక్ష దీపోత్సవం



వెదురుకుప్పం,డిసెంబర్ 5 ప్రభాతవార్త : ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉండాలనే లక్ష దీపోత్సవ కార్యక్రమం తలపెట్టడం జరిగిందని ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామీజీ పేర్కొన్నారు. సోమవారం లక్ష దీపోత్సవ కార్యక్రమం ఏర్పాట్లు పరిశీలిస్తూ విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని వెదురుకుప్పం ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో ఎంపీపీ నాగరాణి హేమసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో డిసెంబర్ 6న మంగళవారం కార్తీక మాస కృత్తిక నక్షత్రంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు సుఖశాంతులతో ఆరోగ్య వంతంగా ఆనందంగా ఉండాలని తలపెట్టిన మహాయజ్ఞం లాంటిదని భక్తులు సహకరించి కార్యక్రమం విజయ వంతం చేయాలని కోరారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పురోహితులు, వేదమంత్రాల నడుమ లక్ష దీపోత్సవం జరుగుతుందన్నారు. లక్ష దీపాలు వెలిగించడం వలన పరమశివుని అనుగ్రహం లభిస్తుందన్నారు భక్తులు భక్తిశ్రద్దలతో పూజ కార్యక్రమంలో పాల్గొని భగవం తుని కృప, ఆశీస్సులు పొందాలన్నారు. అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, రాష్ట్ర మంత్రి పెద్ది రామచంద్రా రెడ్డి, చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డప్ప, టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవీ సుబ్బా రెడ్డి, ఏపీఎస్ఆర్టీసీ వైఎస్‌ఛైర్మెన్ విజయానందరెడ్డి, జిల్లా జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు, శ్రీశైలం దేవస్థానం ఛైర్మెన్ చక్రపాణి రెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమీషనర్ ఏకాంబరం, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటిసీలు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి, చక్రధర్ సిద్దాంతి, ఎంపిటిసి పుత్తూరు రాధిక పురంధర్ రెడ్డి, నాయకులు రామయ్య, శివశంకర్ రెడ్డి, ఆనంద రెడ్డి, బొజ్జా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతికి స్వాగతం పలికిన మేయర్,కమిషనర్





తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీషా, కమిషనర్ అనుపమ అంజలిలు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

## ఎన్ఆర్ఎస్‌టిసిను సందర్శించిన రాష్ట్ర పరిశీలనాధికారిణి



పలమనేరు,డిసెంబరు 5 ప్రభాతవార్త: పలమనేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎన్ఆర్‌సిటిఎస్ కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలన అధికారిణి గీతా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఆర్‌సిటిఎస్ కేంద్రంలో చదువులున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి అనంతరం రెగులర్ విద్యార్థులతో పాఠశాలలో చేర్చుకోవడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి లీలారాణి,ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రికార్డు స్థాయిలో 1.43 కోట్లు ఆదాయం



కాణిపాకం, డిసెంబర్ 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా రికార్డు స్థాయిలో 1.43 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. సోమవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా కేవలం 17 రోజులకు గాను హుండీల ద్వారా 1,43,93,201 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 80 గ్రాముల బంగారు, 1 కిలోల 390 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 318 అమెరికా డాలర్లు, 5 యూరో కరెన్సీ, 2 సింగపూర్ డాలర్లు,74 మలేషియా రింగిట్స్ 10 ఇంగ్లాడ్స్ రింగిట్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, హేమమాలిని,హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు కోదండ పాణి, శ్రీధర్‌బాబు, శ్రీనివాస్, రవి, యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యవసాయ సలహాదారుకు జడ్పీ ఛైర్మన్ పరామర్శ



చిత్తూరు, డిసెంబర్ 5 ప్రభాతవార్త: గుండెపోటుకు గురై హైదరాబాదు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకొంటున్న రాష్ట్ర వ్యవసాయ సలహారులు ఆంబాటి కృష్ణారెడ్డిని సోమవారం జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితిని జడ్పీ ఛైర్మన్ అడిగి తెలుసుకొన్నారు. త్వరగా ఆంబాటి కృష్ణారెడ్డి కోలుకొని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తిరిగి రావాలని జడ్పీ ఛైర్మన్ ఆకాంక్షించారు.

## నెహ్రూ సేవా సంఘంకు సేవారత్న అవార్డు



వడమాలపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త: మండలంలోని నెహ్రూ యువజన సేవా సంఘంకు సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ స్వచ్ఛంధ సేవకుల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో సేవా ఉత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నెహ్రూ సేవా సంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకమరాజులకు సేవారత్న పురస్కారాలను యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సాంఘిక సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల వృద్ధుల సంక్షేమం తదితర రంగాల్లో సేవలందించినందుకు సేవారత్న పురస్కారం లభించినట్లు వెంకమరాజు తెలిపారు.

## మృత్యుంజయస్వామికి ప్రత్యేకాభిషేకాలు:



శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. సోమ వారం మృత్యుంజయ స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకం జరిపారు. పుష్పాలంకారం ఎంతో ఆకట్టుకుంది. గజమాలలు, వెండి ఆభరణాలతో మృత్యుంజయస్వామిని అలంకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతులిచ్చారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని హర హర మహాదేవ శంభోశంకర అంటూ స్మరించారు.

## స్వామి వారికి పల్లకి సేవ



శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం ఉదయం భక్తులతో కిట కిటలాడింది. సాధారణంగా సోమవారం ఉదయం ఓ వైపు దీపాల కాంతి, మరో వైపు స్వామి సన్నిధిలో అభిషేకాలకు భక్తులు కిట కిట లాడుతారు. ఈ నేపధ్యంలో సోమవారం ఆలయంలోపల స్వామి వారికి పల్లకి సేవను నిర్వహించారు. భక్తుల కన్నులు మిరుమిట్లు గోల్పునట్లు ఉత్సవం నిర్వహించారు. తమ ఆరాధ్యదైవం శివయ్యను పల్లకి పై మోయటానికి భక్తులు విశేష సంఖ్యలో ఉత్సాహం చూపారు.

## ఆలయ ఉద్యోగి హఠాన్మరణం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాహుకేతు మండపాల ఇన్‌చార్జిగా పని చేస్తున్న బి.మునిరత్నం రెడ్డి (55) సోమవారం హఠాన్మరణం పొందారు. ఆతను గత కొంత కాలంగా వెరికాస్ వ్యాధితో బాధపడుతూ ఉన్నారు. పానగల్‌కు చెందిన మునిరత్నంరెడ్డి విది నిర్వహణలో ఎంతో జవాబుదారితనంతో పని చేసే వారు. ప్రస్తుతం ఆయన అటెండర్ అయినా రూ.500లు, 750ల రాహుకేతుదోష నివారణ పూజా సామగ్రి కౌంటర్లలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన రెండు రోజుల క్రితం చెన్నైలో వైద్యసదుపాయం కొసం సెలవు పెట్టి వెళ్ళారు.అయితే అక్కడ డాక్టర్లు లేనందువల్ల తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. అక్కడ రక్త ప్రసరణ ఆగిపోవటంతో ఆకస్మిక మరణం చెందినట్లు సమాచారం అందింది. మునిరత్నంరెడ్డి మృతికి దేవస్థానం ఉద్యోగుల సంఘం సంతాపం తెలిపారు.వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## నేడు శివయ్యకు అగ్నితో అభిషేకం...చొక్కాణికి సన్నాహాలు



శ్రీకాళహస్తి,డిసెంబర్ 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సేవలుపూజల్లో మాఘశిర మాసంలో నిర్వహించే సేవ శివయ్యను అగ్నితో పూజించటం ఆనవాయితి.ఈ నేపధ్యంలో చొక్కాణి ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపధ్యంలో మంగళవారం చొక్కాణి ఉత్సవాలకు సన్నాహాలు చేస్తున్నారు. 2020లో కోవిడ్ నిబంధనలతో 20121 కోవిడ్‌తోపాటు బురువి తుఫానుతో రద్దు చేసారు.ఈ ఏడాది భక్తుల భాగస్వామ్యంతో చొక్కాణి ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో సోమ వారం ఆలయాధికారులకు బాధ్యతలు అప్పగించారు. కాగా సోమవారం రాత్రి ఆలయంలోని అమ్మవారి గర్భగుడి ఎదురుగా బాల దీపాలను వెలిగించి ఊరేగింపుగా ఆలయంలోని నాలుగు ప్రాంతాల్లో ఉత్సవం జరిపి అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసారు. ఈ బాల దీపాలతో మంగళవారం రాత్రి చొక్కాణి చెట్టును కాల్చుతారు. అగ్నితో స్వామికి అభిషేకిస్తారు.ఈ కార్యక్రమాలు మంగళవారం రాత్రి ఏడుగంటలకు నిర్వహించనున్నారు.స్థానిక భక్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొంటారని అంచనాలతో ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమ్మవారి సేవలో దేశ ప్రథమ పౌరురాలు





తిరుచానూరు,డిసెంబర్ 5 ప్రభాతవార్త: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సోమవారం దేశ ప్రథమ పౌరురాలు(రాష్ట్రపతి) ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు.ఆలయం వద్దకు చేరుకున్న గౌరవ రాష్ట్రపతికి టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈఓ ఎవి.ధర్మారెడ్డి,జేఈఓలు సదాభార్గవి,వీరబ్రహ్మం,సివిఎస్ఓ నరసింహ కిషోర్‌లు పుష్పగుచ్ఛాలు అందచేసి ఘన స్వాగతం పలికారు.అర్చకులు సాంప్రదాయబద్ధంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం గౌరవ రాష్ట్రపతి ఆలయంలోని ధ్వజస్థంభానికి మొక్కుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.దర్శనానంతరం ఆశీర్వాద మండపంలో ఛైర్మన్,ఈఓలు అమ్మవారి తీర్థ ప్రసాదాలు,శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.గౌరవ రాష్ట్రపతి వెంట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు నారాయణస్వామి,కొట్టు సత్యనారాయణ,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి,రాష్ట్ర మంత్రి ఆర్‌కె,రోజా,జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి,జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి,చెన్నై టిటిడి స్థానిక సలహా మండలి ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, టిటిడి మాజీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఏవిఎస్ఓ శైలేంద్ర బాబు, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు,అర్చకులు బాబుస్వామి,మణికంఠ స్వామిలు పాల్గొన్నారు.

## దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపతి ముర్ముకు ఘన వీడ్కోలు



రేణిగుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త: రాష్ట్ర పర్యటనలో భాగంగా తిరుపతి తిరుమల రెండు రోజుల పర్యటన అనంతరం సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఘనంగా వీడ్కోలు లభించింది. ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి హోదాలో కె.నారాయణస్వామి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయ, రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ (సీఎస్ ప్రతినిధి), డా. రవిశంకర్ ఏపీ అదనపు డీజీపీ శాంతి భద్రతలు మంగళగిరి(డీజీపీ ప్రతినిధి), జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, తిరుపతి ఎస్పీ ఎస్.పరమేశ్వర్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ జి.భానుప్రకాష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. యూనియన్ మినిస్టర్ ఆఫ్ కల్చర్ టూరిజం, డీవోఎన్ ఈఆర్ జి.కిషన్‌రెడ్డి, రాష్ట్రపతితో పాటుగా ప్రత్యేక వాయుసేన విమానంలో ఢిల్లీకి బయలుదేరారు.